రోడ్లు తళతళ..
బతుకులు విలవిల


ప్రధాన రహదారుల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు(ఫైల్)

- నగరాన్ని అద్దంలా మెరిపిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
- చాలీచాలని జీతాలతో కుటుంబాల అవస్థలు
- పర్మినెంట్‌కు నోచుకోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు
- పీఆర్‌సీ, కనీస వేతనం పెంచాలని వేడుకోలు

రామంతాపూర్: కష్టానికి కేరాఫ్ అడ్రస్ పారిశుద్ధ్య కార్మికులు.. రోజంతా ఇష్టానుసారంగా పారేసిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేయడం మొదలుపెట్టి.. తెల్లవారుజామున 6–7 గంటల వరకు రోడ్లతో పాటు అన్ని ప్రాంతాలను తళతళా మెరిపిస్తారు. అందరూ నిద్రిస్తున్న వేళ వారు రోడ్లపైకి వస్తారు.. ఎవరికి కేటాయించిన పనులను వారు నిర్వర్తిస్తూ చకచకా పనులు పూర్తి చేస్తారు. ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల్లోని అంతర్గత రోడ్లు సైతం అందంగా ముస్తాబవుతాయి. జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో దాదాపు 90శాతం మహిళలే పనిచేస్తున్నారు.

దేవుళ్లతో సమానమని కేసీఆర్ కితాబు..

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడ డివిజన్ల పరిధిలో దాదాపు 600 మంది మహిళా కార్మికులు ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా మండే ఎండలో, ఎముకలు కొరికే చలిలో, భారీగా కురుస్తున్న వర్షంలో తడుస్తూ పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న చెత్త, ఇతర వ్యర్థాలను తొలగిస్తారు. వీరి సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ పారిశుద్ధ్య కార్మికులు దేవుళ్లతో సమానమని పలుమార్లు కితాబిచ్చారు. దుమ్ము, ధూళి దుర్గంధం మధ్య పనిచేసే పారిశుధ్య కార్మికులు ఒళ్లునొప్పులు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ప్రధాన రోడ్లను శుభ్రం చేసే సమయంలో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని పలువురు మృతి చెందిన ఘటనలు సైతం ఎన్నో జరిగాయి.

వేయికళ్లతో ఎదురుచూపులు..

జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్‌లో పనిచేస్తున్న 600 మంది పారిశుద్ధ్య మహిళా కార్మికులు, ఔట్‌సోర్సింగ్ విధానం, కాంట్రాక్ట్ పద్ధతిలో ఎన్నో ఏళ్లుగా తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తున్నారు. తమ ఉద్యోగాలు ఎప్పటికైనా పర్మినెంట్ అవుతాయని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వీరికి ఇస్తున్న రూ.17 వేల జీతంలో ఈఎస్ఐ, పీఎఫ్‌పోనూ రూ.14,500 చేతికి అందుతుంది. రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలు, మందులు, పిల్లల చదువులకు ఇతర ఖర్చులకు సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కూడా పీఆర్‌సీ అమలు చేసి కనీసం నెలకు రూ.20 వేల జీతం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీహెచ్‌ఎంసీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కూడా పీఆర్‌సీ అమలు చేసి వారి వేతనాలు పెంచాలి. ఈ విషయంపై సీపీఎం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషిచేస్తా.

– ఎర్రం శ్రీనివాస్, కార్యదర్శి, ఉప్పల్ సర్కిల్ సీపీఎం

పర్మినెంట్ చేయాలి..



జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి. అదేవిధంగా వారి ఆరోగ్య భద్రత కోసం కార్పొరేట్ ఆస్పత్రులలో, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్సల కోసం హెల్త్ కార్డులు మంజూరు చేయాలి.

– వెంకన్న, కార్యదర్శి, సీఐటీయూ కార్మిక విభాగం ఉప్పల్

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: మరమ్మతుల కారణంగా 11కేవీ కైలాసగిరి ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంగాపురం కాలనీ, ఏపీహెచ్ కాలనీ ఫేస్–1, ఇందిరానగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌గాంధీనగర్, భక్షిగూడ, నవోదయనగర్, కైలాసగిరి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

11కేవీ ఎంజే కాలనీ ఫీడర్ పరిధిలో..

ఏఎస్‌రావునగర్ సెక్షన్ 11కేవీ ఎంజే కాలనీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంజే కాలనీ, గాయత్రినగర్ పార్టు, 11కేవీ గాంధీనగర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాయత్రినగర్ పార్టు, చందాబాగ్, ఎంజే కాలనీ పార్టు, ఈస్ట్ ప్రగతినగర్, బోడే బండ ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఏఈ అర్చన తెలిపారు.

రామంతాపూర్ పరిధిలో..

రామంతాపూర్: సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామంతాపూర్ ప్రధాన రహదారి, గోకుల్‌నగర్, గణేష్ నగర్, దూరదర్శన్, ఓల్డ్ రామంతాపూర్, శారదా నగర్, కళ్ల కంపౌండ్ రోడ్డు, కృష్ణ హోటల్, అదేవిధంగా మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఐడీఏ ఉప్పల్, లక్ష్మీనారాయణ కాలనీ, అరవింద్‌నగర్, నేతాజీనగర్, రాజేంద్రనగర్, చర్చి కాలనీ, టీవీ కాలనీ, గాంధీనగర్, శ్రీరామ కాలనీ, శ్రీరమణపురంలో కరెంటు ఉండదని ఏఈ రాములు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత షుగర్, కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. నిర్వాహకులు ఊట్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యం.. శోభితం



ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తర సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గీత గణేశన్ ఆధ్వర్యంలో నాట్య అంజలి కూచిపూడి, భరత నాట్యం, ఒడిసి, కథక్ తదితర ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. మంగళ చరణ్, సరస్వతి, కృష్ణవందన, దేశ్ చతురంగ, శివ తారంగం, మొదలైన అంశాలను వైష్ణవి, ముకుందన్, ముంది దాస్ ఒడిసి అమేయ సమీష్, భరత నాట్యం, శ్రద్ధ, కథక్, లక్ష్మీధర్ గినియా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – ఉప్పల్

రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా నిరంకుశ పాలన


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు

అల్వాల్: రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో 375, 376, 377 బూత్‌లలో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతో భుజం, భుజం కలుపుతూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న బీజేపీకి మద్దతు పలకాలని కోరారు. రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ, అవినీతి పాలన సాగిస్తోందన్నారు. అబద్ధాలు, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో విద్య, వైద్య వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేంద్ర నిధులను దారి మళ్లిస్తూ అక్రమాలు, అవినీతికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంకుశ, అవినీతి, కుటుంబ పాలనతో గోస పడుతున్న ప్రజల కోసం గ్రామగ్రామాన గల్లిగల్లీలో బహిరంగ సభలు నిర్వహించి బీజేపీని అధికారంలోకి తెచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరుణశ్రీ, హేమంత్‌కుమార్, శైలేష్‌బాబు, చందు, వెంకటేష్, ప్రకాష్ చౌదరి, మల్లికార్జున్ యాదవ్, వినయ్ శంకర్, భాస్కర్, అనిల్‌రాజు, ఉదయ్, అజిత్‌సాయి, యశ్వంత్, సుజాత, పద్మిని, శ్రావణి, ప్రతిభ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ సేవలు మరువలేనివి



బోడుప్పల్: బోడుప్పల్ తారాపురి కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజహితం కోసం సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్పొరేటర్లు కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, భూక్యా సుమన్‌నాయక్, కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, బంజార సేవా సంఘం అధ్యక్షుడు రవీందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి సాంబయ్యానాయక్, కోశాధికారి భిక్షపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వక్ఫ్ బోర్డు సమస్య పరిష్కారానికి జాగరణ



బోడుప్పల్: వక్ఫ్ బోర్డు సమస్య పరిష్కారానికి ఆర్‌ఎన్‌ఎస్ ఫేస్–1 గణేష్ మండపం వద్ద శనివారం రాత్రి ఆ కాలనీవాసులు మహా శివరాత్రి సందర్భంగా సామూహిక జాగరణ నిర్వహించారు. సామూహిక భజన, ప్రవచనాలు కొనసాగించారు. ఉపవాస దీక్షలో ఉన్న వారికి పండ్లు, సలాడ్స్‌ను ఏర్పాటు చేశారు. విశ్రాంత ప్రధానాచార్యులు, డాక్టర్ సంగన భట్ల నరసయ్య ప్రవచనలు కొనసాగాయి. రాత్రి 10.45 నుంచి 12 గంటల వరకు లింగోద్భవ, భజన, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



బోడుప్పల్: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్ అన్నారు. అంబేద్కర్‌నగర్, దేవేందర్‌నగర్ కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు కాలనీవాసులు చెత్త చెదారాన్ని రోడ్లపై వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యర్థాలు, కుళ్లిపోయిన పదార్థాలను చెత్త బుట్టలో ఉంచి స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందించాలని కోరారు. డివిజన్ ప్రజల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

మహిళలకు కరాటేలో ఉచిత శిక్షణ

కాచిగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఆర్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు కాచిగూడలోని అకాడమిలో మహిళలకు ఉచితంగా కరాటేలో మెలకువలు నేర్పించడం జరుగుతుందని అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు సెల్: 9494112424.

రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో ప్రహర్షితకు గోల్డ్ మెడల్

కాచిగూడ: కోహినూర్ సీఎం కప్ ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్ షిప్ –2023లో కాచిగూడ ప్రాంతానికి చెందిన కుమారి ప్రహర్షిత గోల్డ్‌మెడల్ అందుకుంది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కోహినూర్ సీఎం కప్ పోటీల్లో అద్భుత ప్రతిభను కనబర్చి గోల్డ్‌మెడల్‌ను సాధించింది. గోల్డ్‌మెడల్ సాధించిన ప్రహర్షితను కాచిగూడ కార్పొరేటర్ కన్నెఉమా రమేష్ యాదవ్ అభినందించి సత్కరించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

మల్లాపూర్: మల్లాపూర్ నందీశ్వరాలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెరి పోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీహరిగౌడ్, పీఆర్, నాగరాజు, పీజీ సుదర్శన్, మల్లేష్, వాసుగౌడ్, శ్యాంసుందర్, ప్రవీణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లోని పలు ప్రాంతాల్లో..

అల్వాల్/గౌతంనగర్: మహా శివరాత్రి సందర్భంగా అల్వాల్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజాము వరకు జాగరణ నిర్వహించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని శివాలయాల్లో తెల్లవారుజామున ఉపవాస దీక్షలు విరమించారు. అల్వాల్ శివాలయంలో రవి, సురేష్‌ల ఆధ్వర్యంలో పదేళ్లుగా అన్నదానం చేస్తున్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణీనగర్ విజయ వినాయక ఆలయం, మల్లికార్జునగర్‌లోని మల్లన్న ఆలయంలో పూజలు చేశారు.

చిలుకానగర్ శివాలయంలో..

ఉప్పల్: చిలుకానగర్ శివాలయం, శివశంకర ఆలయంలో శివపార్వతుల కల్యాణ ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, బింగి శ్రీనివాస్, మహాంకాళి లక్ష్మణ్ పాల్గొన్నారు.


చిలుకానగర్ శివాలయంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు


అల్వాల్‌లో అన్నదానం

యువతలో ఉత్సాహం నింపేందుకే పోటీలు


విజేతకు ట్రోఫీ అందజేస్తూ..

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీలను చిలుకానగర్ ప్రతిభ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, ఉప్పల్ బీజేపీ కన్వీనర్ దేవసాని టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ యువతలో క్రీడాసక్తి పెంచేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం గెలుపొందిన కళ్యాణపురికి చెందిన ఆసిఫ్ టీంకు సీసీఎల్ క్రికెట్ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో గోనే శ్రీకాంత్, పాల్వంచ విట్టల్, అలే నరేంద్ర, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య


పూజిత(ఫైల్)

ఉప్పల్: భర్త మందలించినందుకు క్షణికావేశానికి గురైన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో నివాసం ఉంటున్న మనోజ్ అల్యూమినియం ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తుంటాడు. భార్య పూజిత(21) ఆన్‌లైన్‌లో టెలీ మార్కెటింగ్‌లో పని చేస్తోంది. వారికి తొమ్మిది నెలల కూతురు ఉంది. ఈ క్రమంలో ఆదివారం పూజిత ఫోన్‌లో మాట్లాడుతుండగా ఫోన్ లాక్కుని భర్త మందలించాడు. అనంతరం అతడు బయటకు వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె కూతురు కోసం చీరతో కట్టిన ఊయలను విప్పింది. అనంతరం దాంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పూజితను నిత్యం వేధించేవాడని, అందుకే ఆమె ఆత్మహత్య చేసుకుందని నిజామాబాద్ నుంచి వచ్చిన ఆమె కుటుంబ సభ్యులు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మల్కాజిగిరిపై చెరగని ముద్ర

ఎమ్మెల్యే సాయన్న మృతిపట్ల విచారం


ఎమ్మెల్యే సాయన్న (ఫైల్)

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం ఏర్పడక ముందు ఈ ప్రాంతం నేటి కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో ఉండేది. 1994 నుంచి 2009 వరకు మూడుసార్లు టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్న వివిధ అభివృద్ధి పనులు చేపట్టి మల్కాజిగిరిపై చెరగని ముద్ర వేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడంపై మల్కాజిగిరి ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. రామక్రిష్ణాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆర్‌కె పురం రైతుబజార్, జూనియర్ డిగ్రీ కళాశాలల ఏర్పాటు, మున్సిపల్ కార్యాలయం నూతన భవనం ఏర్పాటు, సఫిల్‌గూడ లేక్‌పార్కు(మినీ ట్యాంక్ బండ్)అభివృద్ధిలో కీలక ప్రాతపోషించారు. కాలనీల్లో తాగు నీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశారు.

ఆయన సేవలు చిరస్మరణీయం

సాయన్న మల్కాజిగిరికి చేసిన సేవలు చిరస్మరణీయమని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు ఎస్‌ఆర్ ప్రసాద్, రాఘవన్ అన్నారు. మూడుసార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొంది అనేక సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించి పేదల మనిషిగా నిలిచిపోయారన్నారు.

ఇళ్లను ముంచుతున్న మురుగు

- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టదా..?
- మరమ్మతులు చేసినట్లు ఎస్సెమ్మెస్‌లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు


అన్నపూర్ణ కాలనీలో ఇళ్ల ముందు డ్రైనేజీ

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్‌బిట్ అన్నపూర్ణ కాలనీ వీధి నంబర్–3లో డ్రైనేజీ బ్లాక్ అయ్యి ఇళ్లలోకి మురుగు చేరుతోంది. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగుతో ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొందని, దోమల స్వైర విహారంతో రోగాలు పంజా విసురుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే డ్రైనేజీకి మరమ్మతులు చేయకపోయినా మరమ్మతులు పూర్తి చేసినట్లు మెసేజ్‌లు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు ఛత్రపతి


హెచ్‌బీకాలనీలో శివాజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మీర్‌పేట–హెచ్‌బీకాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో శివాజీ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. అలుపెరుగని పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ అన్నారు. భవిష్యత్ తరాలకు శివాజీ మహారాజ్ స్ఫూర్తి అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, వాసుదేవగౌడ్, శ్రావణ్‌రెడ్డి, పాండు, భాస్కర్, మహేష్, శివ, ఉపేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో..

అల్వాల్: అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో శివాజీ జయంతిని టీజేఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.దయాకర్, ప్రభునాథ్, విష్ణుమూర్తి, పవన్‌కుమార్, వాసు, భరత్, సురేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో..

రామంతాపూర్: రామంతాపూర్‌లోని నేతాజీనగర్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, బీఎల్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. చాంద్‌పాషా, పవన్, రాజు, వెంకటేష్, గౌతమ్, ఆకాష్, కిరణ్, సతీష్, శంకర్, నరేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రామంతాపూర్ శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిండేరు హన్మంతరావు, కార్పొరేటర్లు కక్కిరేని చేతనహరీష్, శ్రీవాణివెంకట్రావు, స్థానికులు బాలరాజు యాదవ్, సాయినాథ్, హరీష్, రమేష్, శ్రీనివాస్, నరేష్‌గుప్తా పాల్గొన్నారు.


నేతాజీనగర్‌లో అన్నదానం చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి


అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో టీజేఎస్ నాయకులు